క్లుప్తంగా

పట్టాభిరామా... గోవిందా..!



నారాయణవనం: పద్మావతీ సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా శనివారం రాత్రి పట్టాభిరాముడు సీతా సమేతుడై సర్వభూపాల వాహనంపై, ఉదయం గో రక్షకుడైన బాలకృష్ణునిగా కల్యాణ వెంకటేశ్వరస్వామి గ్రామోత్సవాలలో భక్తులకు దర్శనమిచ్చారు. 7.30 గంటలకు కల్పవృక్ష వాహనంపై గ్రామ వీధుల్లో విహరిస్తూ భక్తులను కటాక్షించారు.

భక్తులకు అన్నదానం



శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయం ప్రాంగణంలోని బ్రహ్మశ్రీ ఓంకార స్వామి జీవ సమాధి వద్ద శనివారం డీఎస్పీ భీమారావు చేతుల మీదుగా భక్తులను అన్నదానం చేశారు. సౌత్ సెంట్రల్ రైల్వే బోర్డు సభ్యుడు ఐతా మురళీకృష్ణ, రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

సమయ పాలన పాటించాలి

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని గ్రామ సచివాలయాల్లో పనిచేస్తున్న సిబ్బంది విధిగా సమయ పాలన పాటించాలని, ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ త్రివిక్రమ్‌రావు ఆదేశించారు. శనివారం ఆయన ఆలత్తూరు గ్రామ సచివాలయాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. స్పందనలో వచ్చే వినతులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని, వాటిపై అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో సర్పంచ్ చంద్రారెడ్డి, గ్రామ కార్యదర్శి స్వర్ణ మంజుల, వీఆర్‌ఓలు పాల్గొన్నారు.

ముక్కంటి సేవలో..



ఆలయ ధ్వజస్తంభం వద్ద జస్టిస్ కుమారప్పన్

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని శనివారం తమిళనాడు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సి.కుమారప్పన్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ దక్షిణ గోపురం వద్ద ఆలయ అధికారులు ఆయనకు సాంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. స్వామి అమ్మవార్ల దర్శనానంతరం గురుదక్షిణామూర్తి సన్నిధిలో ఆలయ పండితులు ఆశీర్వచనం పలికారు. స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు.

ఆటపాటలతో అభ్యాసం

రేణిగుంట: ఆటపాటలతో కూడిన అభ్యాసం పిల్లలకు ఎక్కువ కాలం గుర్తుండే అవకాశం ఉందని రేణిగుంట శాఖ గ్రంథాలయాధికారిణి ఏ.శ్రీముఖి అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిబిరంలో భాగంగా శనివారం పిల్లలకు ఆటపాటలతో కూడిన పరిసరాల స్థితిగతులు, వాటి నుంచి నేర్చుకునే విషయాలపై అవగాహన కల్పించారు. విద్యా వికాస వేదిక కన్వీనర్ ఓ.వెంకటరమణ ఆటపాటలను నేర్పించారు.


సైకిల్ తొక్కితే ఆరోగ్యం



విద్యార్థులకు సైక్లింగ్ పోటీలు నిర్వహిస్తున్న దాసుకుప్పం పీహెచ్‌సీ వైద్యసిబ్బంది

సత్యవేడు: రోజూ సైకిల్ తొక్కితే బరువు తగ్గడంతోపాటు గుండెజబ్బులు, అనారోగ్య సమస్యలు దరి చేరవని పీహెచ్‌సీ డాక్టర్ గుణశేఖర్ అన్నారు. వరల్డ్ సైకిల్ డే పురస్కరించుకుని శనివారం సత్యవేడు పంచాయతీ ఉళవ చేనులో దాసుకుప్పం డాక్టర్లు, సిబ్బంది సైకిల్ తొక్కడం వల్ల కలిగే ప్రయోజనాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. రోజూ అర్థ గంట సైకిల్ తొక్కితే కలిగే ప్రయోజనాలు తెలియజేశారు. అనంతరం విద్యార్థులకు సైక్లింగ్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ బి.మురళీకృష్ణ, ఎంపీహెచ్‌ఈఓ వెంకటరమణ, ఎంపీహెచ్‌ఎస్ పి.కృష్ణయ్య, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

కరెంటు షాక్‌తో వ్యక్తి మృతి



శ్రీనివాసులు (ఫైల్)

శ్రీకాళహస్తి: కరెంటు షాక్‌కు గురై వ్యక్తి మరణించిన సంఘటన శనివారం మండలంలోని అమ్మపాళెంలో చోటుచేసుకుంది. వివరాలు.. గ్రామంలో ఓ ఇంటికి సంబంధించి నేలపై పడి ఉన్న సర్వీసు వైరును గమనించిన గ్రామస్తుడు యాతలూరు శ్రీనివాసులు(59) దానిని తొలగించబోయారు. సర్వీసు వైరుకు ఉన్న కమ్మీ తగలడంతో విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు.

బాలకార్మిక వ్యవస్థను ప్రోత్సహిస్తే కఠిన చర్యలు

శ్రీకాళహస్తి: బాల కార్మిక వ్యవస్థను ప్రోత్సహిస్తే కఠిన చర్యలు తప్పవని ఆర్టీసీ డిపో మేనేజర్ రాజవర్థన్‌రెడ్డి అన్నారు. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనపై శనివారం ఆర్టీసీ డిపో ఆవరణలో అవగాహన కల్పించారు. డిపో మేనేజర్, న్యాయవాది మల్లికార్జునయ్య మాట్లాడారు. బాలలను ఎవరైనా పనుల్లో పెట్టుకుంటే కేసులు ఎదుర్కోవలసి వస్తుందన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ సిబ్బంది, పారా లీగల్ వలంటీర్లు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్బీకే సేవలతో వ్యవసాయం

మట్టిని నమ్ముకున్న రైతన్నలు విత్తనాలు, ఎరువుల కోసం మండల కేంద్రానికి వచ్చి క్యూలలో గంటల తరబడి నిరీక్షించినా ఒక్కోసారి అందని పరిస్థితి. చివరకు శ్రమల కోర్చి పంటలు పండించినా గిట్టుబాటు ధర లభించక దళారుల పాలయ్యేది. ఒకానొక దశలో క్రాప్ హాలిడేను ప్రకటించిన దయనీయమైన పరిస్థితులు. మరోవైపు సబ్సిడీ వ్యవసాయ పనిముట్లు, యంత్రాలను రైతుల పేరిట పచ్చనేతలే హాంఫట్ చేయడం.. ఇదంతా టీడీపీ పాలన నాటి పరిస్థితి. అయితే వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక ఈ దురవస్థలకు చెల్లుచీటీ పాడేలా విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టింది. రైతు భరోసా కేంద్రాల ఏర్పాటుతో విత్తనాలు మొదలు ఎరువులు, వ్యవసాయ పనిముట్లు మొదలైనవన్నీ రైతుల ముంగిటకే చేర్చింది. ఈ సంస్కరణలు, జవాబుదారీతనంతో అందిస్తున్న సేవలు తమకు వ్యవసాయంపై భరోసానిచ్చేలా ఉంటున్నాయని మండల వ్యాప్తంగా రైతాంగం హర్షం వ్యక్తం చేస్తోంది.







మండలంలో చెరకు పంట సాగు, రైతులకు వ్యవసాయ ట్రాక్టర్ల పంపిణీ, ఆర్‌బీకేలలో రైతులకు పంపిణీ చేస్తున్న ఎరువులు

- వైఎస్సార్ రైతు భరోసా కేంద్రాలతో అన్నదాతలకు విస్తృత సేవలు
- రేణిగుంట మండలంలో 15 ఆర్‌బీకే కేంద్రాలు
- 3,958మంది రైతులకు సేవలు
- 2,244 హెక్టార్లలో సేద్యం

రేణిగుంట: మండలంలో 19 గ్రామ పంచాయతీలుండగా, 15 రైతు భరోసా కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. అత్తూరు, గాజులమండ్యం, ఎల్లమండ్యం, సూరప్పకశం, విప్పమానుపట్టెడ, కొత్రమంగళం, రేణిగుంట, జీపాళెం, గురవరాజుపల్లె, గుత్తివారిపల్లె, ఆర్.మల్లవరం, కృష్ణాపురం, వెంకటాపురం, కరకంబాడి, మామండూరులలో ఆర్‌బీకే కేంద్రాలు సొంత భవనాల్లో నడుస్తున్నాయి. మండలంలో ప్రధానంగా వరి, వేరుశనగ, మామిడి, చెరకు, అరటి, పూలమొక్కలు, కూరగాయలను రైతులు ఎక్కువగా పండిస్తున్నారు.

ఆర్‌బీకేలతో రైతులకు అందుతున్న సేవలు

రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసి అక్కడ సచివాలయ అగ్రికల్చరల్ అసిస్టెంట్, పశు సంవర్థక శాఖ, ఉద్యానవన శాఖ సిబ్బంది కూడా వ్యవసాయ అనుబంధ రంగాలకు సంబంధించిన సిబ్బందిని ప్రభుత్వం నియమించింది. రైతులకు ఎరువులు, విత్తనాలు, యంత్ర పరికరాలు, ట్రాక్టర్లు, రొటోవేటర్లు, కల్టివేటర్లు, స్ప్రేయర్లు ఇత్యాది వాటిని సబ్సిడీపై ఇస్తోంది.

- ప్రతినెల మొదటి శుక్రవారం ప్రతి ఆర్‌బీకేలో రైతులతో వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహిస్తారు. ఆ నెలలో వారికందివ్వాల్సిన సేవలపై చర్చించి ప్రాధాన్యత క్రమంలో నిర్దేశించుకుంటారు. రెండవ శుక్రవారం మండల స్థాయిలో ఈ సమావేశాలు నిర్వహిస్తారు.
- మట్టి నమూనాలను సేకరించి, భూసార పరీక్షలు చేయించడమే కాకుండా ఆ రిపోర్టు ఆధారంగా వాడాల్సిన ఎరువులపై రైతులకు అవగాహన కలిస్తారు.
- ఇంటిగ్రేటెడ్ కాల్ సెంటర్ 155251 టోల్ ఫ్రీ నంబరుతో రైతులకు వ్యవసాయ సమాచారం తెలుసుకునే వెసులుబాటు తీసుకొచ్చారు.
- ప్రస్తుతం ప్రతి ఆర్‌బీకేలో రైతులకు పచ్చిరొట్ట విత్తనాలైన జనుము, జీలుగలను 50శాతం సబ్సిడీతో అందిస్తున్నారు.
- రైతుల పొలాల్లో పీఎం కిసాన్ కింద ఈ-క్రాప్ నమోదు చేస్తారు. ప్రకృతి వైపరీత్యాలతో పంటలకు నష్టం వాటిల్లితే రైతులకు రోజుల వ్యవధిలో పరిహారం అందేలా చూడటం.
- పంటలకు గిట్టుబాటు వచ్చేలా ప్రభుత్వమే కొనుగోలు చేసే వెసులుబాటు కల్పించారు.

15 ఆర్బీకేలలో పంపిణీ చేసినవి	
ఎరువులు:	198 మెట్రిక్ టన్నులు
పురుగుల మందులు:	156 లీటర్లు
వేరుశనగ విత్తనాలు:	191 క్వింటాళ్లు
వైఎస్సార్ యంత్ర సేవా పథకం ట్రాక్టర్లు:	6
వైఎస్సార్ రైతు భరోసాతో రైతులు పొందిన లబ్ధి:	రూ.16.28కోట్లు
మొత్తం రైతుల సంఖ్య:	3,958
ఏర్పాటైన కస్టం హైరింగ్ గ్రూపులు:	12
ప్రస్తుతం అందుబాటులో ఉన్న ఎరువులు:	25 మెట్రిక్ టన్నులు
జనుము విత్తనాలు:	25 క్వింటాళ్లు
జీలుగ విత్తనాలు:	60 క్వింటాళ్లు

ధైర్యంగా సేద్యం చేస్తాండా



నాకు రెండెకరాల పొలం ఉంది. మా ఊరి నుంచి రేణిగుంటకైతే 15 కిలోమీటర్లు రావాలి. ఇంతకుముందు (టీడీపీ పాలనలో) ఎరువులు, విత్తనాల కోసం చానా ఇబ్బందులు పడినా. ఇప్పుడు ఆ బాధలే లేవబ్బా! మా ఊర్లోనే రైతు భరోసా సెంటరు పెట్టినారు. విత్తనాలు, ఎరువులు, మాకేం కావాలో అన్నీ అక్కడే ఇస్తాండారు. లైన్లలో నిలబడాల్సి పనిలేదు. నేరుగా ఆడికి పోతా..తెచ్చుకుంటా..జగనన్న ప్రభుత్వం వల్లే ధైర్యంగా సేద్యం చేస్తాండా.

-ఎస్.రామయ్య, కృష్ణాపురం

సేద్యానికి దన్ను



ఒకప్పుడు రైతులకు ఇచ్చే పొలం పనిముట్లు, ట్రాక్టర్లు టీడీపీ నాయకులే పంచుకునే వారు. రైతులకు అవి అందేవి కాదు. ఇప్పటి ప్రభుత్వం రైతు గ్రూపులను ఏర్పాటు చేసి ఆ గ్రూపులకు వ్యవసాయ పనిముట్లను ఇస్తున్నారు. వాటిని నామమాత్రపు అద్దెకు ఇచ్చి రైతులందరికీ అందుబాటులో ఉంచుతున్నారు. రైతు భరోసా నగదుతో సేద్యంలో పెట్టుబడి ఖర్చుకు సాయం చేస్తున్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక రైతులు ఎంతో మేలు చేస్తున్నారు.

-బి.కేశవులురెడ్డి, సూరప్పకశం

సెంటరు పెట్టినాక బాధలు తప్పినాయ్



మా ఊర్నుంచి రేణిగుంటకు రావాలంటే 17 కిలోమీటర్లు. పొలంలో ఏం పండించాలన్నా విత్తనాల కాణ్నుంచి ఏంగానీ సరిగా దొరికేవి కాదు. రేణిగుంటకో, ఆ పక్కన కోడూరుకో పోయి తెచ్చుకునేవాళ్లం. రైతు భరోసా సెంటరు పెట్టినాక ఈ బాధలు తప్పినాయి. నేరుగా అన్నీ ఆడే దొరకతాండాయి.

-పి.యశోదమ్మ, మామండూరు

లాభసాటిగా మారిన వ్యవసాయం



ఆర్బీకేల ఏర్పాటు, సచివాలయ అగ్రికల్చరల్ అసిస్టెంట్ల నియామకంతో ప్రభుత్వం రైతాంగానికి ఎంతో మేలు చేస్తోంది. గతంతో పోలిస్తే రైతులు పనుల కోసం మండల వ్యవసాయ కార్యాలయానికి రావడం పూర్తిగా తగ్గింది. వారి గ్రామాల్లోనే ఆర్‌బీకేల సేవలు పొందుతూ వ్యవసాయాన్ని లాభసాటిగా చేసుకుంటున్నారు.

-సునీల్‌కుమార్, మండల వ్యవసాధికారి, రేణిగుంట

ప్రతి కుటుంబమూ ఆర్థిక ప్రగతి : ఎమ్మెల్యే

కేవీబీపురం: జగనన్న ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ప్రతి కుటుంబమూ ఆర్థిక ప్రగతిని సాధించిందని సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పేర్కొన్నారు. మండలంలోని పవనివారికండ్రిగలో శనివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం నిర్వహించారు. లబ్ధిదారులు పొందిన సంక్షేమ పథకాల లబ్ధిని బుక్‌లెట్లతో వివరించారు. తన దృష్టికి గ్రామస్తులు నివేదించిన సమస్యలను సంబంధిత అధికారులు పరిష్కరించాలని ఆదేశించారు.

ఎమ్మెల్యేకి శ్రీవారి దారు శిల్పం బహూకరణ

గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ కార్యకర్త వెంకట సుబ్బయ్య కుటుంబాన్ని ఎమ్మెల్యే కలిశారు. ఆ కుటుంబం పొందిన లబ్ధిని తెలియజేశారు. వెంకట సుబ్బయ్య తాను తయారు చేసిన శ్రీవారి దారుశిల్పాన్ని ఎమ్మెల్యేకు బహూకరించారు. పార్టీ మండల కన్వీనర్ గవర్ల కృష్ణయ్య, ఎంపీపీ మునిలక్ష్మి, జెడ్పీటీసీ మునెమ్మ, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు బొగ్రా మాధవీరెడ్డి, నేతలు నందకుమార్, లాల్‌బాబుయాదవ్, ఎంపీటీసీ జ్యోతి, మునేంద్ర, బాలయ్య, మునిరాజా, శంకరయ్య, ఎంపీడీఓ రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.



శ్రీవారి దారు శిల్పం ఇస్తున్న వెంకటసుబ్బయ్య

వీడ్కోలు సన్మానం

వరదయ్యపాళెం: విధి నిర్వహణలో ఈఓపీఆర్డీ విజయకుమారి సేవలు అభినందనీయమని మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితులు దామోదర్‌రెడ్డి అన్నారు. ఎంపీడీఓగా ఉద్యోగోన్నతిపై తూర్పు గోదావరి జిల్లాకు బదిలీపై వెళ్తున్న ఆమెను శనివారం సాయంత్రం మండల పరిషత్ కార్యాలయంలో ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. ఎంపీడీఓ సుబ్రమణ్యం రాజు, సీనియర్ అసిస్టెంట్ మురళి, ఏపీఓ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్లకట్టవ ప్రమాదంపై అసత్య ప్రచారాలు చేయొద్దు

వరదయ్యపాళెం: ఆపదలో ఉన్న కుటుంబాలను బాధ్యతాయుతంగా అన్నివిధాలా అండగా నిలిచిన సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలంపై దుష్ప్రచారం చేస్తున్న ఎల్లో మీడియా చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితులు దామోదర్‌రెడ్డి తెలిపారు. శనివారం మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో మండల సర్పంచులు, ఎంపీటీసీలు, ఇతర ప్రజాప్రతినిధులతో కలసి పాత్రికేయుల సమావేశం నిర్వహించి ఆయన మాట్లాడారు.ఎల్లకట్టవలో అనధికారిక బాణసంచా తయారీ కేంద్రంలో జరిగిన అగ్నిప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన బాధిత 3 కుటుంబాలకు ఎమ్మెల్యే చొరవతో 24గంటల వ్యవధిలోనే రూ. 5లక్షల చొప్పున ఆ కుటుంబాలకు ఆర్థికసాయం అందజేశారని, అయితే చెక్కులు ఇవ్వడానికి వెళ్లిన జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యేను అడ్డుకున్నారని ప్రచారం చేయడం ఎంతవరకు సమంజసమన్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో మండలంలోని కళత్తూరు ప్రసన్న వేంకటేశ్వరస్వామి తెప్పోత్సవంలో చోటు చేసుకున్న అపశ్రుతిలో తెప్పలు మునిగిపోయిన ఘటనలో ఇద్దరు దుర్మరణం చెందారని, అప్పట్లో సెల్ టవర్ ఎక్కి నిరసన తెలిపినా టీడీపీ ప్రభుత్వం ఆర్థిక సాయం ఇచ్చిన పాపానపోలేదని గుర్తు చేశారు. సమావేశంలో జేసీఎస్ కన్వీనర్ చిన్నా, జెడ్పీటీసీ వెంకటేశ్వర్లు, సింగిల్‌విండో చైర్మన్ హరిబాబురెడ్డి, మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు చంద్రారెడ్డి, వక్ఫ్ బోర్డు జిల్లా డైరెక్టర్ అబ్దుల్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పాల సుబ్రమణ్యం రెడ్డి, కో-ఆప్షన్ సభ్యుడు సిద్దిక్, సర్పంచులు శ్రీధర్ రెడ్డి, కిషోర్, చంద్రా, సుబ్రమణ్యం, కరుణాకర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న విద్యాకానుక కిట్ల పంపిణీ

సత్యవేడు: మండలంలో 67 పాఠశాలలకు జగనన్న విద్యాకానుక కిట్లను అందజేయడానికి ఎంఈఓ రవి పూనుకున్నారు. శనివారం గురుకుల బాలుర పాఠశాల వద్ద ఉపాధ్యాయులకు జగనన్న విద్యాకానుక కిట్ల పాఠ్య పుస్తకాలు, నోట్‌బుక్స్, యూనిఫాం, షూలు, సాక్సులు, బెల్టులు, బ్యాగులు, డిక్షనరీలు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ, మండలంలో 4,870 మంది విద్యార్థులకు పాఠశాల ప్రారంభించిన రోజునే విద్యాకానుక కిట్లను అందజేయాలని ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు. కార్యక్రమంలో గురుకుల పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాసులు, ఉపాధ్యాయులు బి.సురేష్‌కుమార్, వి.బేబి, సీఆర్పీలు చెంగమ్మ, మునస్వామి, బాలకృష్ణ, భాస్కర్ పాల్గొన్నారు.

కెరీర్ గైడెన్స్‌పై అవగాహన

రేణిగుంట: విద్యార్థులకు సరైన కెరీర్ గైడెన్స్‌తోనే అనుకున్న లక్ష్యాలకు చేరువవుతారని రాస్ ప్రాజెక్టు ఆఫీసర్ జయచంద్రనాయుడు అన్నారు. మండలంలోని కరకంబాడి రాస్ ప్రాజెక్టు కార్యాలయంలో శనివారం చైల్డ్ ఫండ్ ఇండియా సహకారంతో రాస్ బాలాజీ బాలవికాస్ దత్తత గ్రామాలకు చెందిన 10వ తరగతి, ఇంటర్ ద్వితీయ సంవత్సరం పూర్తి చేసిన విద్యార్థులకు కెరీర్ గైడెన్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మున్ముందు డిమాండ్ ఉన్న కోర్సుల గురించి తెలియజేశారు. కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్లుగా సీఎస్‌ఎస్‌ఆర్ సంస్థ ప్రతినిధులు గణేష్, పద్మావతి విద్యార్థులకు పలు సూచనలిచ్చారు. ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ భారతి, రాస్ సిబ్బంది పాల్గొన్నారు.

కెపాసిటీ బిల్డింగ్‌పై..

శ్రీకాళహస్తి: స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో శనివారం కెపాసిటి బిల్డింగ్ అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపల్ బి.రాజశేఖర్, రిసోర్స్ పర్సన్ నరసింహారావు మాట్లాడారు. ప్రస్తుతం మారుతున్న జీవనశైలి, ఆహారపు అలవాట్ల మూలాన ఆరోగ్య సమస్యలు కొనితెచ్చుకుంటున్నారని, వ్యాయామం చేయడం ఒక వ్యాపకంగా చేసుకుంటే మంచిదన్నారు. వైస్ ప్రిన్సిపల్ దీనదయాల్, అధ్యాపకులు మాలతి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య

ఏర్పేడు: ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందిస్తున్నట్లు ప్రగతి సంస్థ పాపానాయుడుపేట క్లస్టర్ కన్వీనర్ సుబోస్ అన్నారు. శనివారం మండలంలోని చెన్నంపల్లెలో బడిఈడు పిల్లల తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ, బడిఈడు పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేర్చాలని కోరారు. ప్రభుత్వ స్కూళ్లలో మెరుగైన వసతులు, నాణ్యమైన విద్యాబోధన ఉన్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ప్రగతి సంస్థ ప్రతినిధులు కోటేశ్వరి, రాజేశ్వరి, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రోడ్డు అభివృద్ధికి నిధులు కేటాయించరూ!

సత్యవేడు: మండలంలోని కాళమనాయుడుపేట-గాంధీపురం (గిరిజనకాలనీ)కి అనుసంధానంగా ఉన్న రోడ్డు అభివృద్ధికి నిధులు కేటాయించాలని సర్పంచ్ టి.జయ మండల అధికారులను, ప్రజాప్రతినిధులను కోరారు. కాళమనాయుడుపేటలో బుధవారం నిర్వహించనున్న గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమంపై మండల కన్వీనర్ కే.సుశీల్‌కుమార్ రెడ్డి, మాస్టర్ స్కూల్ చైర్మన్ కే. చంద్రశేఖర్‌రెడ్డి సచివాలయ సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సర్పంచ్, ఎంపీటీసీ, వార్డు సభ్యులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లను కోరారు. ఈ సందర్భంగా సర్పంచ్, నియోజకవర్గ యూత్ వింగ్ అధ్యక్షుడు గోవిందస్వామి కలసి గాంధీపురం రోడ్డు అభివృద్ధికి నిధులు కేటాయించాలని అభ్యర్థించారు. కాళమనాయుడుపేట సమీపంలో దెబ్బతిన్న రోడ్డును పరిశీలించారు. ఎంపీటీసీ మోహన్, సర్పంచ్ బాలాజీ, మాజీ ఎంపీటీసీ సురేష్‌బాబు, సచివాలయ కార్యదర్శి మనోజ్, వెల్ఫేర్ అసిస్టెంట్ శామ్యూల్, డిజిటల్ అసిస్టెంట్ గోవర్ధన్, సర్వేయర్ వెంకటేష్, మహిళా పోలీసులు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

ఆలయానికి ఎమ్మెల్యే విరాళం



విరాళం అందజేస్తున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

శ్రీకాళహస్తి: మండలంలో పాపనపల్లెలోని అంకాళమ్మ పరమేశ్వరి ఆలయానికి శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి శనివారం రూ.లక్ష విరాళం అందజేశారు. పట్టణంలోని వైఎస్ఆర్‌సీపీ కార్యాలయంలో ఆలయ కమిటీ సభ్యులు కలివేలయ్యకు ఈ విరాళం ఇచ్చారు.

నిత్యాన్నదానానికి..





విరాళం అందజేస్తున్న దాతలు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయ దేవస్థానంలో నిర్వహించే నిత్యాన్నదానానికి ఇద్దరు భక్తులు రూ.1.25లక్షలు విరాళంగా అందజేశారు. పట్టణంలోని గజేంద్రనగర్ ప్రాంతానికి చెందిన మునిసుందరమ్మ రూ.లక్ష, చెన్నైకు చెందిన వెంకట శివరామకృష్ణ, కుటుంబ సభ్యులు రూ.25 వేలను పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులుకు అందజేశారు. దాతలకు స్వామి అమ్మవార్ల జాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు.

నాడు-నేడు పనుల పరిశీలన

బుచ్చినాయుడుకండ్రిగ: బుచ్చినాయుడుకండ్రిగ, కాటూరులోని ప్రాథమిక పాఠశాలల్లో జరుగుతున్న నాడు-నేడు రెండవ విడత పనులను శనివారం మండల విద్యాశాఖాధికారి రవీంద్రనాథ్ పరిశీలించారు.ఆయన మాట్లాడుతూ నాడు-నేడు మొదటి విడతలో 27 పాఠశాలల్లో రూ.5 కోట్లతో పనులను పూర్తి చేసినట్లు తెలిపారు. అలాగే రెండవ విడత విడతలో రూ.6 కోట్లతో 22 పాఠశాలల్లో పనులు వేగవంతంగా చేస్తున్నారని, ఫలితంగా ప్రైవేటు పాఠశాలలకంటే మిన్నగా ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయన్నారు.

ఘనంగా అలుగు ఉత్సవం

ఏర్పేడు: మండలంలోని పాత వీరాపురంలో ద్రౌపదీ ధర్మరాజుల స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం అలుగు ఉత్సవం ఘనంగా నిర్వహించారు. స్వామి అమ్మవార్లకు విశేష అభిషేక పూజలు చేశారు. గ్రామంలోని యువకులు పోతురాజు ఉత్సవమూర్తితో పాటు అలుగు(కత్తి), కుండను పుర వీధుల్లో ఊరేగించారు. ఆపై ఆలయంలో కుండపై అలుగును నిలిపారు. పలుప్రాంతాల భక్తులు స్వామిఅమ్మవార్ల దర్శించుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మంజుల, ఆలయ చైర్మన్ మాధవరెడ్డి, మాజీ జెడ్పీటీసీ మునిరంగారెడ్డి, మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు గురవారెడ్డి, మాజీ ఎంపీటీసీలు మునిరత్నంరెడ్డి, కోదండరామిరెడ్డి, ఆలయ పూజారి రవి తదితరులు పాల్గొన్నారు.